# వాళ్ల 'ఆస్తి'

మండువేసవి. బండలు బ్రద్దలయ్యేఎండ. తీక్షణమైన వడగాలి. పకృతి అంతా శూన్యంగావుంది.

* * *

మిట్ట మధ్యాహ్నము. సూర్యుడు నడినెత్తిన వున్నాడు. అతని తీక్షణ కిరణ జ్వాలలకు తాళలేక ఎక్కడివాళ్లక్కడ యిండ్లల్లో దూరారు. కాని యీ పాపిష్టిడొక్కకోసం తంటాలుపడి వాళ్లుమాత్రం ఎర్రటగ్గిలో కాలేదుమ్ములో బాడుగ బండ్లు లాక్కుంటున్నారు. ఆడవాళ్లు కూడా యిలాంటి సమయంలో తమ పసిపిల్లలను గుడిశెల్లో వదలి ఫ్యాక్టరీలలో పనిజేయటానికి వచ్చారు. వుక్కబోసి చెమట్లు దిగ్గారిపోతున్నవి. చెమటపోసిన శరీరంమీద ఫ్యాక్టరీదుమ్ము పౌడరద్దినట్లుంది.

* * *

వెంకి, కూతుర్ని కొడుకుని పసిపిల్లాడిదగ్గర కావలిపెట్టి పనిలోకి పోయింది ఫ్యాక్టరీకి. వెంకిభర్త బాడుగబండ్లు లాక్కోటానికి బజారుకెళ్లాడు. పసిపిల్లాడికి పదిమాసాలు, కొడుక్కి ఆరేళ్ళు, కూతురికి ఎనిమిదేళ్ళుంటాయి. పసిబిడ్డ ఈ వరదాకా నిద్రపోయ్యేడు. యిప్పుడే మేల్కొని ఎండదెబ్బ కాగలేక ఏడ్వసాగాడు. నాలుక ఎండిందేమోనని కాసినినీళ్ళు పట్టింది పసిబిడ్డకు వెంకికూతురు. కాసేపూరుకొని మళ్లా రోదన మొదలెట్టాడు. వడగాలికి పాపం ముఖం అంతా పీక్కుపోయింది. యిక కుర్రవాడి ఏడ్పు మాన్పేదెలా? బుడ్డిపాలు పడదామంటే మొన్ననే వకబేడబుడ్డి తెచ్చుకుంటే రెండు రోజుల్లోనే ఆఖరు అయింది. అందుట్లో బీదవాళ్ళ పిల్లలకు పొట్టలు పెద్దవి. కుర్రాడు ఒకే తీరున ఏడవటం మొదలెట్టాడు. ఏమీ తోచక తమ్ముణ్ని గుడిసెకు కావలిపెట్టి వెంకికూతురు పిల్లాణ్ని చంక నేసుకొని బయలుదేరింది.

* * *

ఎండ తీక్ష్ణానికి కుర్రాడి మాడు అదిరిపోతుంది. మాడుమీద గుడ్డేసుకొని వుడుకుదుమ్ములో కాళ్ళు కాలుతుంటే కళ్లంబడి నీళ్ళు కార్చుకొంటూ చంకలోనుండి జారే కుర్రాణ్ని పైకెత్తుకుంటూ ఫ్యాక్టరీకెళ్ళింది. తల్లిని చూడగానే పిల్లాడు కేవురుమన్నాడు. వెంకి తలమీద తట్ట అవతలపెట్టి కాళ్ళు చేతుల దుమ్ము కడుక్కొని "మా నాయనే, నేచచ్చిపోయానే ఆకలి అయ్యిందంటే చిట్టితల్లీ" అంటూ చేతులు చాచింది. కుర్రాడు తల్లి చేతుల్లోకి దూకాడు.

* * *

వెంకి కుర్రాడికి పాలిస్తూనేవుంది. చెయ్యికుర్రాడిమీద వేసి నిమురుతూ ఒకచేత్తో కూతురి వెండ్రుకలు ముఖంమీదినుండి వెనక్కి లాగుతుంది. యింతలో వెంకి కొడుకు సుబ్బడు ఏడుస్తూ పరుగెత్తుకొచ్చాడు. ఏంటిరా సుబ్బా గుడిశె వదలి వచ్చావు అంది వెంకి. ఏడుస్తూ జవాబు చెప్పనేలేదు కుర్రాడు. కాళ్ళుకాలి ఏడుస్తున్నాడేమోనని ఎంచి 'యిక్కడి కెందువు చచ్చావురా యింకాస్సేపుంటే అప్పవచ్చేది గుడిసెలో నూకలున్నవి. మన గుడిశెలదగ్గర దొంగ ముండాకొడుకులున్నారు'అని వీపుమీద వొకటి చరిచింది. యింకా పెద్దగా ఏడుస్తూ 'మన... గూడెంలో... నిప్పంటుకుంద'ని చెప్పాడు.

ఉది వినగానే వెంకి ప్రాణాలు పైపైనే లేచిపోయినవి. వెంటనే వళ్ళో కుర్రాణ్ని పిల్లకిచ్చి మేనేజరు వద్ద కెళ్లింది. టయిమ్ కానిదే వెళ్ళటానికి వీల్లేదన్నాడు.

* * *

ఇంతలో పిల్లలొచ్చి రావే అమ్మా! వెళదామన్నారు. పోతే యివ్వాళ కూలి పోతుందనుకొని పిల్లాణ్ని చంకవేసుకొని వురికింది గుడిశెలవద్దకు వెంకి. వెళ్లేలోపల వెంకి గుడిశెకుకూడా నిప్పంటుకుంది నలువైపుల. వెంకి పిల్లాణ్ని దించి గుడిశెలో జొరబడ్డది. మళ్లా తిరిగి రాలేక పోయింది నిప్పు మంటవల్ల.

* * *

గుడిశె కాలి కూలబడ్డది. చూస్తుండగనే వెంకి భర్త వచ్చాడు. 'ఏమిరా! కాలేగుడిశెలో జొరబడే అవసరమేమి వచ్చింద'ని అడిగారు జనం. 'పది రూపాయల నోటొకటి మూటగట్టి దాచుకున్నాం బాబూ, దానికోసంవెళ్ళి వుంటుంది బాబు' అని చెప్పాడు. చూస్తున్న జనం అయ్యో! పాపం అని ఒకపెద్ద నిట్టూర్పుతోనే తమ కర్తవ్యాని నెరవేర్చుకున్నారు.

శ్రీ ఈదర లక్ష్మీనారాయణ